క్లుప్తంగా

మాదిగల కవాతును జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: ఈ నెల 27న ఎమ్మార్పీఎస్ ఖమ్మం నగర కమిటీ ఆధ్వర్యాన జెడ్పీ సెంటర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిర్వహించే సన్నాహక కవాతును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నాయకులు కోరారు. బుధవారం ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఖమ్మం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తూరుగంటి అంజయ్య మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి మూడు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా వరంగల్‌లో మాదిగల ఆత్మగౌరవ కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు రాము, సైదులు, జనార్దన్, నాగేశ్వర రావు, మోహన్, రాములు, అశోక్ పాల్గొన్నారు.

రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న సుబ్బారావు

కూసుమంచి: సీపీఎం సభ్యులకు రెండ్రోజుల పాటు నిర్వహించనున్న రాజకీయ శిక్షణ తరగతులనుబుధవారం కూసుమంచిలో పార్టీ సీనియర్ నాయకుడు శీలం గురుమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.సుబ్బారావు మాట్లాడుతూ.. కమ్యూనిస్ట్ సభ్యులు నిత్య విద్యార్థుల్లా మారి ప్రస్తుల రాజకీయాలకనుగుణంగా వృద్ధి చెందాలన్నారు. అనంతరం ఆర్థిక విధానాలు అనే అంశంపై పిట్టల రవి తరగతులను బోధించగా.. ప్రిన్సిపల్‌గా మల్లెల సన్మంతరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ ఇన్‌చార్జ్ బుగ్గవీటి సరళ, మండల కార్యదర్శి ఎడవెల్లి రమణారెడ్డి, తోటకూరి రాజు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: మాల మహానాడు జిల్లా కమిటీని బుధవారం ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో జరిగిన జిల్లా స్థాయి విస్తృతస్థాయి సమావేశంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కె.సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా గుమ్మడి కనకరాజు, కోశాధికారిగా ఏలియాతో పాటు 12 మంది ఉపాధ్యక్షులు, 12 మంది సహాయ కార్యదర్శులు, 5 గురు వర్కింగ్ ప్రెసిడెంట్లు, 5గురు ప్రచార కార్యదర్శులు, 5గురు స్టీరింగ్ కమిటీ సభ్యులు, 3 గౌరవ సలహాదారులు, 20 మంది కార్యవర్గ సభ్యులుగా మొత్తం 65 మందితో కమిటీని ఎన్నుకున్నారు. సీనియర్ నాయకుడు గెంతేటి వీరభద్రం, పల్లా రాజశేఖర్, లింగాల రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రభాకర్, వీరబాబు, శ్రీనివాస్, సుందర్ రావు, రాములు, పుష్పరాజ్, దయానంద్, భవాని, రమ్య, స్వాతి పాల్గొన్నారు.

మండలంలో 50 వేల మొక్కలు నాటాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ యర్రయ్య

నేలకొండపల్లి: ఈ వానాకాల సీజన్‌లో మండలంలోని ప్రతీ పంచాయతీకి ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేస్తూ మొత్తం 50 వేల మొక్కలు నాటాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. అలాగే మండలంలో మిషన్ భగీరథ సర్వేను శరవేగంగా పూర్తి చేయాలని, అమ్మ ఆదర్శ పాఠశాల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, ఈజీఎస్ ఏపీఓ సునీత, ఈసీ శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	మనమే
వినోద	హరోమ్ హర
సాయిరాం	ఇంద్రాని ఎపిక్ 1
ఆదిత్య	రాజధాని రౌడీ
శ్రీనివాస	మహారాజ
సుందర్	లవ్ మౌళి

- ఖమ్మంగాంధీచౌక్

సమస్యలతో సతమతం..!



మర్రిబాయిలో పేరుకుపోయిన చెత్త

25వ డివిజన్‌లో సమస్యల తిష్ట

- మర్రిబావిలో పేరుకుపోయిన పూడిక
- దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బంది పడుతున్న స్థానికులు
- సక్రమంగా లేని రోడ్లు, డ్రెయిన్లు
- మురికికూపంగా దర్శమిస్తున్న వైనం
- పట్టించుకోని పాలకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం నగరంలోని 25వ డివిజన్‌లో నెలకొని ఉన్న సమస్యలను పాలకులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇందులో ప్రధానంగా కుమ్మరిబజార్ మర్రిచెట్టు సెంటర్‌లో ఉన్న బావిలో పూడిక పేరుకుపోవడంతో మురికికూపంగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో చుట్టుపక్కల వారు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో పాటు చాలా కాలంగా అనారోగ్య పాలు కావాల్సివస్తుంది. అలాగే దోమల బెడద ఎక్కువ కావడంతో అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈనేపథ్యాన ఈ ప్రాంతవాసికి ఇటీవల దోమ కుట్టి బోధకాలు వచ్చిన సంఘటన ఉండడం గమనార్హం. గతేడాది వానకాలంలో డెంగీ, మలేరియా వ్యాధులతో అనేక ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతటి సమస్యలను ఎదుర్కొంటూ జీవనం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

మురికి నీళ్లతో ఇబ్బందులు

రోజు విడిచి రోజు వచ్చే పంపు నీళ్లు మురికిగా ఉంటున్నాయి. దీంతో నిత్యావసరాలకు గానీ తాగు నీటికి గానీ వాడుకోలేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. గత్యంతరం లేక కొందరు ఈ నీటిని వినియోగిస్తే రోగాల బారినపడాల్సి వస్తుంది. ఇకనైనా మురికి నీటిని శుద్ధి చేసి సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పొంగుతున్న డ్రెయిన్..

ఈ ప్రాంతంలోని డ్రెయిన్‌లో చెత్తా చెదారం పేరుకుపోవడంతో చిన్నపాటి వర్షానికే డ్రెయిన్ పొంగుతుంది. ఈనేపథ్యాన ఎస్సీ కాలనీ, కుమ్మరిబజార్, రిక్కా బజార్, అద్దంకిబజార్‌లలో డ్రెయినేజీ నీళ్లు రోడ్డు మీదకు వస్తున్నాయి. దీంతో అటుగా ప్రయాణించే వాహనచోదకులు, పాదచారులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. డ్రెయిన్‌లో ఎప్పటికప్పుడు పూడిక తీయించి మురుగు నీరు బయటకు రాకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సగం రోడ్డుతో తంటాలు..



అద్దంకిబజార్‌లోని సీసీ రోడ్డు

డివిజన్‌లోని అద్దంకిబజార్‌లో సగం రోడ్డు మాత్రమే వేసి తతిమారోడ్డు వదిలేశారు. దీంతో వాహనాల రాకపోకలను ఇబ్బందికరంగా మారింది. రాత్రి సమయాల్లో వాహనాలు ప్రమాదాలకు గురికావాల్సి వస్తుందని కాలనీవాసులు వాపోతున్నారు. దీనిపై నగరపాలక అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మర్రిబావి పూడిక తీయాలి..



ఇక్కడ ఎంతో కాలంగా ఉన్న మర్రిబావిలో చెత్తాచెదారంతో పాటో ప్లాస్టిక్ వస్తువులు ఉండడంతో పాటు ఊడలు పెరగడంతో పూడిక నిండింది. దీంతో కనీస అవసరాలకైనా ఉపయోగపడడం లేదు. ఇకనైనా బావి పూడిక తీసి నీటిని అందుబాటులో తేవాలి.

– అచ్యుతరావు, స్థానికుడు

మురికి నీళ్లతో ఇబ్బందులు..



రోజు విడిచి రోజు వచ్చే పంపు నీళ్లు మురికిగా వస్తున్నాయి. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఇటు నీళ్ల వినియోగించుకోవడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. అలాగే నీళ్ల వదిలే సమయాలను మార్చాలి. దీనిపై అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలి.

– దాసరి పూర్ణ, స్థానికుడు

కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న టీజీఓస్ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ముజామిల్‌ఖాన్‌ను గురువారం పలు ఉద్యోగ సంఘాల నాయకులు, వివిధ శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నేపథ్యానటీఎన్జీఓస్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ సాగర్, కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు నందగిరి శ్రీను, కేంద్ర సంఘం కార్యదర్శి జీఎస్ ప్రసాద్ తదితరులు కలిసి కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాదరావు, నాగుల్‌మీరా, వై.శ్రీనివాస రావు, నాగ శివ, స్వప్న, బుద్ధ రామకృష్ణ, ధరావత్ భాస్కర్, యూసుఫ్ అహ్మద్, శాంతకుమారి, స్వర్ణలత, శశికుమారి తదితరులు పాల్గొన్నారు. అలాగే, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీఓస్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రిలు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించగా.. నాయకులు ఉషశ్రీ, సుధారాణి, శేషప్రసాద్, నయింపాషా, వల్లోజి శ్రీనివాసరావు, విజయకుమారి, గణేష్, రామకృష్ణ, వెంకన్న, కృష్ణారావు, ప్రసన్నకుమార్, శారద, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం..

ఖమ్మంగాంధీచౌక్: ముజమ్మిల్‌ఖాన్‌ను బుధవారం ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి వర్గం కలెక్టర్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ అధ్యక్షులు మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, అధ్యక్షులు చిన్ని కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, ఉపాధ్యక్షులు సోమా నర్సింహారావు, సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణ, కోశాధికారి తల్లాడ రమేష్, సెంట్రల్ ఈసీ సభ్యుడు విడాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవ ర్యాలీ



ఖమ్మంరూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఖమ్మంరూరల్: మండలంలోని గొల్లగూడెంలో గల ఆశ్రమ పాఠశాలలో బుధవారం ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్ మాట్లాడుతూ.. ఇది జన్యుపరమైన వ్యాధి అని, పిల్లలకు ఆ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి..

కామేపల్లి: ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి చందన అన్నారు. బుధవారం కామేపల్లిలో ప్రపంచ సికిల్ సెల్ ఎనిమియా, జాతీయ నులి పురుగుల నిర్మూలన రోజు ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు.ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ దూప్‌సింగ్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎం, ఆశాలు పాల్గొన్నారు.

డీసీసీబీ అసిస్టెంట్ మేనేజర్ ఆకస్మిక మృతి

వాజేడు/నేలకొండపల్లి: ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పేరూరు డీసీసీబీ అసిస్టెంట్ మేనేజర్ నరేష్ యాదవ్(35) బుధవారం ఆకస్మికంగా మృతి చెందాడు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెరువుమాధారానికి చెందిన నరేష్ యాదవ్ నాలుగు నెలల క్రితమే బదిలీపై పేరూరులోని బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్‌గా వచ్చారు. వాజేడు మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో గగ్గురి రమణయ్య ఇంట్లో గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఆరోగ్యం బాగా లేదని బుధవారం విధులకు రాలేనని బ్యాంకు ఉన్నతాధికారులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. మధ్యాహ్నం 12 గంటల సమయాన రమణయ్యకు నరేష్‌యాదవ్ అపస్మారక స్థితిలో కనిపించడంతో బ్యాంకు అధికారులకు సమాచారం అందించాడు. దీంతో బ్యాంకు సిబ్బంది వచ్చి చూసే సమయానికే నరేష్ మృతి చెంది ఉన్నాడు. అదే సమయాన ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ సీఈఓ బ్యాంకు తనిఖీ కోసం వచ్చి.. నరేష్ మృతదేహాన్ని పరిశీలించి వివరాలను తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కాగా, గ్యాస్ ఫామ్ అధికం కావడంతోనే మృతి చెంది ఉంటాడని పలువురు అభిప్రాయపడుతున్నారు. అసిస్టెంట్ మేనేజర్ మృతిపై పేరూరు పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు. మృతదేహాన్ని బంధువులు ఖమ్మం జిల్లాలోని స్వగ్రామానికి తీసుకెళ్లినట్లు సమాచారం.

విద్యుత్ బిల్లులు ప్రభుత్వమే చెల్లించాలి

కామేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు గుడిపూడి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండల పరిధిలోని కొత్తలింగాలలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల పండిట్, పీఈటీల పదోన్నతుల ప్రక్రియను ప్రభుత్వం నిర్వహించడంతో వేలాది మంది ఉపాధ్యాయులు పదోన్నతులు, అనేక పాఠశాలల్లో ఖాళీ పోస్టులు భర్తీ అయ్యాయని తెలిపారు. మిగిలిన ఉపాధ్యాయుల బదిలీలు కూడా పూర్తి చేయాలని, పాఠశాలల్లో పరిశుభ్రతకు పార్ట్ టైం వర్కర్లను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి.రాములు, వెంకటేశ్వర్లు, రమణ, నాగిరెడ్డి, మురళీధర్‌రెడ్డి, వెంకన్న, మాలిక, జయ, సునీత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: నగరంలోని 11 కేవీ అల్లీపురం,11 కేవీ శ్రీనగర్‌కాలనీ ఫీడర్ల పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఖమ్మం అర్బన్ సెక్షన్ ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో అల్లీపురం ఫీడర్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, శ్రీనగర్‌కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కాలనీలోని 1 నుంచి 16 నంబర్ల రోడ్లు, పోలీసు కాలనీలో సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు. అదేవిధంగా రఘునాథపాలెం మండలంలోని కోటపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మంచుకొండ సెక్షన్ విద్యుత్ ఏఈ పోలూరి సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు.

సొసైటీ చైర్మన్ అరెస్ట్..

నేలకొండపల్లి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ కోటి సైదారెడ్డిని స్థానిక పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోనాయిగూడెం గ్రామానికి చెందిన నేలకొండపల్లి సొసైటీ చైర్మన్ కోటి సైదారెడ్డి అదే గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, ప్రస్తుత గ్రామదీపిక కొమ్మినేని పుష్పావతిని గత రెండేళ్ల క్రితం ఓ స్థలం వివాదంలో ఆమెపై దాడి చేసి గాయపరిచాడు. దీంతో ఆమె ఫిర్యాదు చేయగా.. బుధవారం నేలకొండపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తోట నాగరాజు తెలిపారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు

కామేపల్లి: మండలంలోని మద్దులపల్లి నిమ్మ వాగు కట్టు లోతట్టు ప్రాంతాన్ని గ్రామానికి చెందిన ఓ రైతు సుమారుగా 3 ఎకరాలు ఆక్రమించాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయకట్టు రైతులు బుధవారం తహసీల్దార్ సుధాకర్‌కు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేశాకే అతడిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

వృద్ధుడికి గాయాలు

కామేపల్లి: మండలంలోని పండితాపురం గ్రామానికి చెందిన నర్సయ్య బుధవారం మధ్యాహ్నం సంతకు వెళ్లాడు. కళ్లు తిరగడంతో రోడ్డు పక్కనే ఆగి ఉన్న కారు పక్కన కూర్చున్నాడు. గమనించని కారు డ్రైవర్ ముందుకు వెళ్లడంతో నర్సయ్య కాలు పైకి టైర్ ఎక్కడంతో కాలు విరిగింది. దీంతో 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విచారణ జరిపించాలి

తిరుమలాయపాలెం: సీతారామ సాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పాలేరు లింకు కెనాల్ భూములు కోల్పోయిన వారికి చెల్లించిన పరిహారంలో అవకతవకలు జరిగాయని రాష్ట్ర విజిలెన్స్ డీ.జీ.కి ఫిర్యాదు చేశారు. వివరాలిలా.. మండలంలోని బీరోలులో దాదాపు 100 ఎకరాలకు పరిహారం చెల్లించారు. కానీ కొంతమంది బోర్లు, బావులు లేకున్నా.. ఉన్నట్లు తప్పుడు రికార్డులతో దాదాపు రూ.50 లక్షల వరకు తీసుకున్నారని వారిపై సమగ్ర విచారణ నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

రైతులకు రుణమాఫీ చేసి తీరుతాం

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కూసుమంచి: పాలేరులో కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి: రాష్ట్రంలోని ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, పేదలకు కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామల్లో జరిగిన సభల్లో మంత్రి మాట్లాడుతూ.. గత పదేళ్లలో నాటి ప్రభుత్వం ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేసినా.. తాము అధికారంలోకి వచ్చే ముందు ఇచ్చిన హామీల మేరకు అర్హులందరికీ తెల్లరేషన్‌కార్డులతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు ఇస్తామన్నారు. అంతేకాక రైతులకు త్వరలో రుణమాఫీ చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పాలేరు నియోజకవర్గంలో మూడేళ్లలోనే అర్హులకు ఇళ్లు నిర్మించి ఇస్తామని, పెన్షన్లు, రేషన్‌కార్డులు కూడా త్వరలోనే అందిస్తామని మంత్రి తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు మంజూరు చేసి నిర్మిస్తామన్నారు. తాగునీరు, విద్యుత్ సమస్యలను రానివొద్దని అధికారులను ఆదేశించారు. అనంతరం పాలేరులో జరిగిన సభలో అర్హులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను మంత్రి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకురాలు మద్దినేని బేబీ స్వర్ణకుమారి, ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్, మాజీ ఎంపీపీలు మట్టె గురవయ్య, జూకూరి గోపాలరావు, ఎడవెల్లి ముత్తయ్య, కాంగ్రెస్ నాయకులు ఎండీ హఫీజుద్దీన్, జొన్నలగడ్డ రవికుమార్, ఎడవెల్లి రాంరెడ్డి, మాదాసు ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి నివాళి..

ఖమ్మంరూరల్: మండలంలోని కాచిరాజుగూడెంకు చెందిన సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ అనుబంధ మహిళా సంఘం నాయకురాలు మలీదు పద్మ ఇటీవల మృతి చెందగా.. బుధవారం ఆమె దశదిన కర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు కళ్లెం వెంకటరెడ్డి, రాయల నాగేశ్వర రావు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యతో పాటు ఆవుల వెంకటేశ్వర్లు, రాయల చంద్రశేఖర్, సీవై పుల్లయ్య, ఆవుల అశోక్, ఎండీ.మౌలానా, నున్నా నాగేశ్వరరావు తదితరులున్నారు.

ఐబీఓ పోస్టర్ల ఆవిష్కరణ..

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మం సహకారనగర్: ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ (ఐబీఓ) 2024–25 సంవత్సరానికి గాను ఎగ్జామినేషన్ క్యాలెండర్ పోస్టర్లను బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించి సంస్థ యాజమాన్యాన్ని, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పుల అశోక్, ఫౌండర్ అండ్ సౌత్ ఇండియా డైరెక్టర్ అంతోటి రామకృష్ణ, రాష్ట్ర ఇన్‌చార్జ్ కె.కావ్య, దివ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి



ఎస్సీ డీడీకి వినతిపత్రం ఇస్తున్న ఫోరం బాధ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, చిన్నచిన్న మరమత్తులను చేయించాలని వసతి గృహ సంక్షేమ అధికారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు కోరారు. ఈమేరకు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ, బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి గుడికందుల జ్యోతి, ఎస్టీ సంక్షేమశాఖ అధికారులకు వసతి గృహ సంక్షేమ అధికారుల ఫోరం తరపున బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రుక్మారావు మాట్లాడుతూ.. వసతిగృహాల్లో శానిటేషన్ కోసం ప్రత్యేక నిధులు సమకూర్చాలని, అన్ని భవనాలకు రంగులు వేయించాలని కోరారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న సంక్షేమ అధికారులకు నిబంధనల ప్రకారం ఈఎల్‌లు మంజూరు చేయాలన్నారు. సమస్యలపై అధికారులు సానుకూలంగా స్పందించారని, త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి నెల్లూరి నాగేశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం.వీరయ్య, కోశాధికారి కె.తిరుపతిరావు, కల్చరల్ సెక్రటరీ ఎస్.విజయ, ఈసీ మెంబర్ ఎం.వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సంఘాల నేతలు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రముఖ రచయిత అరుంధతిరాయ్‌పై ఉపా కేసు పెట్టడాన్ని నిరసిస్తూ బుధవారం పీడీఎస్‌యూ, పీవైఎల్, పీఓడబ్ల్యూ సంఘాల ఆధ్వర్యాన ఖమ్మంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ, పీవైఎల్ జిల్లా కార్యదర్శులు వి.వెంకటేష్, ఎన్‌వీ.రాకేష్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు గోకినేపల్లి లలితలు మాట్లాడుతూ.. దేశంలో మోదీ ప్రభుత్వం రచయితలు, మేధావులపై ఉపా కేసులు పెడుతూ ప్రశ్నించే వారి గొంతు నొక్కుతుందని అన్నారు. 14 ఏళ్ళ క్రితం కాశ్మీర్ సమస్యలపై అరుంధతిరాయి మాట్లాడిన అంశాన్ని తిరగదోడి ఇప్పుడు కేసు పెట్టారని, వెంటనే ఈ కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం ప్రజాస్వామిక వాదులను, హక్కుల కోసం ఉద్యమించే వారిని హింసించే చర్యలను మానుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఝాన్సీ, శోభ, సురేష్, లక్ష్మణ్, చందు, రవీందర్, శ్రీను, విష్ణు, నరేందర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలేరు పాత కాల్వకు నీరు సరఫరా చేయాలి



రైతులతో మాట్లాడుతున్న ప్రసాద్‌రెడ్డి

నేలకొండపల్లి: మండలంలోని ప్రధాన కాల్వ నుంచి పాలేరు పాత కాల్వకు నీళ్ల సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని పాలేరు పాత కాల్వ ఆయకట్టు రైతులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. బుధవారం ఈమేరకు ఆయకట్టు రైతాంగంతో కలిసి పాలేరు పాత కాల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. రాజేశ్వరపురం గ్రామం వద్ద ప్రధాన కాల్వకు పాలేరు పాత కాల్వకు అనుసంధానం చేస్తూ పైపులు ఏర్పాటు చేస్తే వేసవిలో ఇటు తాగు, సాగు నీటికి ఇబ్బందులు లేకుండా ఉంటుందని పేర్కొన్నారు. దీంతో ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. పాలేరు రైతుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, సూరపనేని రామకృష్ణ, రైతు ప్రతినిధులు చింతనిప్పు సైదులు, అప్పారావు, వజ్జా శ్రీను, యర్రాబాబు, భద్రయ్య, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి ఆశల రాజర్షి రాహుల్‌గాంధీ

నిత్యం ప్రజల శ్రేయస్సు కోసం పరితపించే ప్రజానాయకుడు, ఈ దేశపు రేపటి ఆశల రాజర్షి రాహుల్‌గాంధీ అని పలువురు వక్తలు అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. –సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంవన్‌టౌన్: డీసీసీ కార్యాలయంలో కేక్ తినిపిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నేలకొండపల్లి: నాచేపల్లిలో..



కామేపల్లి: కొత్తలింగాల క్రాస్‌రోడ్డులో..